మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

పచ్చమూక అరాచకాలపై సుప్రీం కొరడా

వైయస్సార్‌సీపీ న్యాయపోరాటంతో స్థానిక ఎన్నికలపై కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్లను అడ్డుకుంటున్నారంటూ వైయస్సార్‌సీపీ సాగిస్తున్న న్యాయపోరాటంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అభ్యర్థులపై దాడులు, బెదిరింపులు, నామినేషన్ పత్రాల చించివేత, పోలీసుల వ్యవహారశైలిపై ఆ పార్టీ చేసిన ఫిర్యాదులు సుప్రీంకోర్టు ముందుకు చేరాయి. వీటికి సంబంధించి సమర్పించిన వీడియోలు, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం ఎన్నికల నిర్వహణపై పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైయస్సార్‌సీపీ తన వాదనకు తగిన ప్రాథమిక ఆధారాలను సమర్పించిందని, ఈ దశలో తగిన ఆదేశాలు ఇవ్వడానికి ప్రాథమికంగా కేసు ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. అక్టోబర్ 21న ప్రకటించాల్సిన అభ్యర్థుల తుది జాబితాను అక్టోబర్ 25 వరకు నిలిపివేయాలని ఆదేశించింది. నామినేషన్ల గడువు పొడిగింపుపై అక్టోబర్ 22లోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది.

నామినేషన్లను అడ్డుకున్నారన్న ఫిర్యాదులు, వీడియో ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం



- వైయస్సార్‌సీపీ వాదనకు ప్రాథమిక ఆధారాలున్నాయని ధర్మాసనం అభిప్రాయం
- అభ్యర్థుల తుది జాబితా ప్రకటనకు అక్టోబర్ 25 వరకు బ్రేక్
- నామినేషన్ల గడువు పొడిగింపుపై 22లోగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఆదేశం
- గడువు పొడిగిస్తే కనీసం 48 గంటల అవకాశం ఇవ్వాలని స్పష్టీకరణ
- అభ్యర్థులకు పోలీసు రక్షణ.. నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు, సీసీటీవీ నిఘా
- 63 శాతం మంది అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని వైయస్సార్‌సీపీ వాదన
- రాజ్యాంగ విరుద్ధమైన చర్యలతో ఎన్నికల స్వేచ్ఛకు విఘాతం కలిగితే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని వ్యాఖ్య
- సుప్రీంకోర్టులో వైయస్సార్‌సీపీ తరపున మణీందర్ సింగ్ వాదనలు
- ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అమలు నివేదికలు కోరిన ధర్మాసనం
- అక్టోబర్ 27న తదుపరి విచారణ

న్యాయ సమీక్షను నిరోధించలేరు

ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందనే కారణంతో రాజ్యాంగ న్యాయస్థానాల న్యాయసమీక్ష అధికారాన్ని పూర్తిగా నిరోధించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం ఈ విచారణలో అత్యంత కీలక అంశంగా నిలిచింది. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు విఘాతం కలిగించే రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన చర్యలు చోటుచేసుకుంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని పేర్కొంది. రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత న్యాయస్థానాలపై కూడా ఉందని గుర్తుచేసింది. స్థానిక ఎన్నికల్లో అధికార కూటమి దౌర్జన్యాలకు పాల్పడుతోందంటూ వైయస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

- మిగతా 2-3 పేజీల్లో..

అదే దౌర్జన్యం.. అవే దాడులు

నామినేషన్లను అడ్డుకుంటూ ప్రజాస్వామ్యంపై కూటమి దాడి!

వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధాలు, దాడులు, బెదిరింపులు

నామినేషన్ కేంద్రాల వద్ద అడ్డంకులు.. అభ్యర్థులు, నాయకులపై పోలీసుల ఒత్తిడి

తాడేపల్లి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పులివెందుల, పిడుగురాళ్ల, దాచేపల్లి, తిరుపతి, కడప సహా పలు ప్రాంతాల్లో అభ్యర్థులు, పార్టీ నాయకులపై దాడులు, బెదిరింపులు, గృహనిర్బంధాలు, నామినేషన్ పత్రాల దాఖలుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కును కాలరాస్తూ భయానక వాతావరణం సృష్టించడం కూటమి పాలనలో ఎన్నికల ప్రక్రియ ఎదుర్కొంటున్న పరిస్థితికి నిదర్శనం.

- మిగతా 3-5 పేజీల్లో..